క్లుప్తంగా

మరెన్నో సాధించాలి..

ఇల్లెందు: స్వచ్ఛ సర్వేక్షన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి పొందిన సింగరేణి పాఠశాల యాజమాన్యాన్ని సోమవారం ఏరియా జీఎం ఎం.షాలేమురాజు అభినందించారు. జీఎం కార్యాలయంలో జీఎంను పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లు కలిసి బహుమతి పొందిన విధానాన్ని వివరించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ఆరుగురు విద్యార్థులు పాల్గొని ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రానున్న కాలంలో మరిన్ని బహుమతులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్

కొత్తగూడెంరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గడగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరరావు అన్నారు. కొత్తగూడెంలోని గణేశ్‌టెంపుల్ పూజలు నిర్వహించిన అనంతరం 22వ వార్డులో ఎస్‌కే అబ్దుల్ సలాం, డాక్టర్ ఎండీ ఆఫీస్, ఎస్‌కే షమీమ్ ఆధ్వర్యంలో సోమవారం పోట్ల నాగేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేబీ శౌరి, మోత్కూరి ధర్మారావు, మహ్మద్ గౌస్, అల్లాడి నర్సింహారావు, కసనబోయిన భద్రం, గద్దం రాజశేఖర్, అజ్మీర రమేశ్, రుక్సానా, యాకూబ్, సాయి, షరీఫ్, అలీ, విల్సన్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

టేకులపల్లి: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నార్త్ ఈస్ట్ తెలంగాణ రీజియన్ కమిటీ సభ్యుడు, ఏఐకేఎంఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పెనక వెంకన్న అలియాస్ విక్రమ్ గత నెల 16న మృతి చెందడం ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ టేకులపల్లి మండల అధ్యక్షుడు కల్తీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో విక్రమ్ సంతాప, బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 11న మహబూబాబాద్ జిల్లా గూడూరు సెంటర్‌లో జరిగే విక్రమ్ సంతాప, బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎట్టి నరసింహారావు, గుగులోత్ రామచంద్ర, కీసర వెంకన్న, దేగటి లాలు, బాణోతు దళ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

ఇల్లెందు: ఇల్లెందులో ట్రాన్స్‌పోర్ట్ రంగ సంఘర్షణ యాత్ర జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్‌ఏ నబీ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ కోరారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ట్రాన్స్‌పోర్టు రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీని పరిరక్షించాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న ఇల్లెందులో సాగే ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుల్తానా, తాళ్లూరి కృష్ణ, శేఖర్, శంకర్, లక్ష్మణ్‌పాసీ, హుస్సేన్, సత్యనారాయణ కోరి, శ్రీను, చందర్, హరిబాబు, రాజేశ్ పాల్గొన్నారు.

'తేమ' కష్టాలు

సుజాతనగర్: కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని విక్రయించేందుకు తేమ అడ్డుపడుతోంది. ధాన్యం ఎండకపోవడంతో తేమ శాతం ఎక్కువగా ఉంటోందని, దీంతో తిప్పలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ ఉండకూడదన్న నిబంధన ఉంది. దీంతో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోకి తెచ్చి కుప్పలుగా పోసిన వరి ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు పడరాని పాట్లు పడతున్నారు. ఆయా కేంద్రాల్లో సరిపడా కవర్లు లేక కిరాయికి తెచ్చుకుంటున్నామని, కవర్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను రైతులు కోరుతున్నారు.

వైద్యుల కేటాయింపు..

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం, రొంపేడు పీహెచ్‌సీలకు కొత్తగా వైద్యులు వచ్చారు. రొంపేడు పీహెచ్‌సీలో నవంబర్ 30న అప్పటి వైద్యుడు కార్తీక్ తన పదవికి రాజీనామా చేశారు. కొమరారం 24 గంటల ఆస్పత్రిలో ఉన్న ఒక్క వైద్యాధికారి డాక్టర్ శ్రీలత పక్షం రోజుల కిందట ఉన్నత చదువులకు వెళ్లిపోయారు. దీంతో నెల రోజులుగా రొంపేడు పీహెచ్‌సీ, పక్షం రోజులుగా కొమరారం పీహెచ్‌సీలు వైద్యులు లేకుండానే కొనసాగాయి. తాజాగా వైద్యుల నియామక ప్రక్రియలో మండలానికి ముగ్గురు వైద్యులను కేటాయించారు. రొంపేడు పీహెచ్‌సీకి డాక్టర్ కవిత, కొమరారం పీహెచ్‌సీకి డాక్టర్ ప్రియాంక, డాక్టర్ లోహితను కేటాయించగా సోమవారం వారు విధుల్లో చేరారు.

పాండురంగాపురంలో ఇరుముడి

పాల్వంచరూరల్: మండలంలోని పాండురంగాపురం గ్రామంలోని ఆంజేయస్వామి ఆలయంలో సోమవారం అయ్యప్పమాలధారుల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు రమేశ్ రాథోడ్ ఆలయ మరమ్మతుల కోసం రూ.4 వేలు వితరణగా అందించాడు. సర్పంచ్ జగదీశ్‌కుమార్, భరత్, ఇస్లావత్ దేవి, బాలు, భద్రు, గుగులోత్ హుస్సేన్‌నాయక్, బానోత్ లక్‌పతి, దస్రు తదితరులు పాల్గొన్నారు.

బస్తీవాసుల అవస్థలు

- మున్సిపాలిటీ 27వ వార్డులో తాగునీటి కటకట
- నల్లాలు సరిగ్గా రావడం లేదని ప్రజల ఆవేదన
- డ్రెయినేజీల్లో మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



27వ వార్డు ఏ-పవర్‌హౌస్‌బస్తీలోని డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగునీరు

కొత్తగూడెంటౌన్: జిల్లా కేంద్రంలోని పలు బస్తీల్లో సమస్యలు పేరుకుపోయాయి. పబ్లిక్ ట్యాప్‌లు కొంచెం సమయం వరకు కూడా రాకపోవడం.. డ్రెయినేజీలు సిల్ట్‌తో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుండటం.. పలు వీదుల్లో చెత్త పేరుకుపోయి డంపింగ్‌యార్డుల్లా దర్శనమిస్తుండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు రాజీవ్ పార్కు, ఏ-పవర్‌హౌస్, రామాటాకీస్, బర్లిఫిట్‌ఏరియా బస్తీలతోపాటు రైల్వే ట్రాక్ సమీపంలోని వార్డు ప్రజలు సమస్యలతో సావాసం చేస్తున్నారు. రాజీవ్‌పార్కులైన్, ఏ-పవర్‌హౌస్‌బస్తీలో తాగునీటి ఇబ్బందులతోపాటు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగునీరు, వీధుల్లో చెత్తాచెదారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ-పవర్‌హౌస్‌బస్తీలోని పలు వీధుల్లో తాగునీటి నల్లాలు ఉన్నప్పటికీ అవి ఎప్పుడు వస్తాయో? రావో? తెలియడం లేదని చెబుతున్నారు. రెండు, మూడు రోజులకోసారి నల్లాలు వస్తాయని, అవికూడా కొద్దిసేపే వస్తాయని పేర్కొంటున్నారు. మున్సిపాలిటీ సిబ్బంది తరచుగా కాలువలను శుభ్రం చేయడం లేదని, దీంతో నీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు విపరీతంగా వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలనీలోని ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నల్లాలు ఏర్పాటు చేయాలి..



మా బస్తీలో తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. సింగరేణి నల్లాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. కానీ, అవి సరిపోవడం లేదు. మా బస్తీలో కిన్నెరసాని నల్లాలు ఉన్నప్పటికీ అవి రెండు, మూడు రోజులకు ఒకసారి వస్తున్నాయి. అధికారులు స్పందించి మా వార్డులో పబ్లిక్ ట్యాప్‌లను ఏర్పాటు చేయాలి.

–నల్వాది సుందర్, ఏ–పవర్‌హౌస్ బస్తీ

వీధుల్లో చెత్త తొలగించాలి



మా కాలనీ వీధుల్లో చెత్త పేరుకుపోయింది. అంతేకాకుండా ఇంట్లో నుంచి వచ్చే మురుగు నీటితో డ్రెయినేజీలు నిండి ఉన్నాయి. తీవ్ర దుర్గంధం వస్తోంది. మురుగునీరు జమ కావడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. తక్షణమే అధికారులు మా వీధుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి.

–జి.శ్యాంచందర్, రామాటాకీస్ ఏరియా

చర్యలు చేపడుతాం..



కొత్తగూడెం మున్సిపాలిటీ 27వ వార్డులోని ఏ-పవర్‌హౌస్, రామాటాకీస్ ఏరియా బస్తీల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తాం. వీధుల్లో ఫాగింగ్ నిర్వహిస్తాం. ఏ-పవర్‌హౌస్ బస్తీలో పబ్లిక్ ట్యాప్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగిస్తాం.

–రఘు, మున్సిపల్ కమిషనర్

అరెస్ట్‌లు నియంతృత్వ వైఖరికి నిదర్శనం

పాల్వంచ: కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి నిర్బంధించడం కేసీఆర్ నియంతృత్వ విధానాలకు నిదర్శనమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. సర్పంచ్‌ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నాకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు ఇవ్వగా, అక్కడికి బయలుదేరిన నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం సరైందికాదని పేర్కొన్నారు. సోమవారం నాయకులు అంబేడ్కర్ సెంటర్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసులు ప్రజల కోసం కాకుండా కేసీఆర్ కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుంటే పనులు చేశాక వారికి నిధులు విడుదల చేయకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, చాంద్ పాషా, చారి, జలీల్, వీరయ్యచౌదరి, పైడిపల్లి మనోహర్, రాములునాయక్, కొండెం వెంకన్న, చంద్రగిరి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రామునాయక్, నరేశ్, ఇమ్రాన్, హీరాలాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు అరెస్ట్

జూలూరుపాడు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగా స్థానిక పోలీసులు కాంగ్రెస్ నాయకులను సోమవారం అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో పోలీసులు ప్రజల కోసం కాకుండా కేసీఆర్ కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. అరెస్టు అయిన వారిలో బొడ్డు కృష్ణయ్య, ముత్తినేని రామయ్య, లకావత్ లచ్చునాయక్, చాపలమడుగు నరసింహారావు, మందా బాబు, తాళ్లూరి అచ్చయ్య ఉన్నారు.

ఘనంగా పొదెం వీరయ్య జన్మదిన వేడుకలు



వీరయ్యకు స్వీట్ తినిపిస్తున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య జన్మదిన వేడుకలు ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, అంతోటి పాల్, గిన్నారపు నాగేందర్ పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు నాగా సీతారాములు పొదెం వీరయ్యను సన్మానించారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. భూక్య దేవానాయక్, భూక్య చంద్రకళ, ఆకారపు స్వప్న, ఇస్లావత్ రెడ్యానాయక్, వీసం శ్రీనివాస్, దంతోజు నవీన్‌కుమార్, భూక్య రవీందర్‌సింగ్, బాణోతు సరిలాల్, ఈసం ప్రసాద్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

పొదెం వీరయ్య జన్మదిన వేడుకలు

ఇల్లెందు: డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య జన్మదిన వేడుకలు ఇల్లెందులో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని రెండు కార్యాలయాల్లో పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియేల్, పులి సైదులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం హాస్పిటల్‌లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజయ్య, హరికృష్ణ, సామ్రాట్, శ్రీరాములు, జాఫర్, ఇబ్రహీం, కాయం రమేశ్, గొగ్గలి పాపయ్య, మహబూబ్, అక్తర్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



కేక్ కట్ చేస్తున్న జీఎం రమేశ్

సింగరేణి(కొత్తగూడెం): ఈ ఏడాది రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేశ్ ఆకాంక్షించారు. సోమవారం ఏరియాలోని జీఎం కార్యాలయ ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జీరో యాక్సిడెంట్‌కు కృషి చేయాలని, ప్రమాదాల నివారణకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ రజాక్, బుడిగం రామకృష్ణ, ఆర్.నారాయణరావు, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, బూర రవీందర్, రమేశ్, కోటిరెడ్డి, శామ్యూల్ సుధాకర్, రాజశేఖర్, యోహాన్, సదానందం, మదన్‌మోహన్, సత్యనారాయణ, కిరణ్‌బాబు, శేషశ్రీ, మాధవ్, రమణారెడ్డి పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం

కొత్తగూడెంఅర్బన్: నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కొత్త ఏడాదిలో అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. ఏ.రామ్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, మస్తాన్, శ్రీను పాల్గొన్నారు.

నేడు సీడీపీఓ పరీక్ష

సుజాతనగర్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియామకం కానున్న సీడీపీఓ (మహిళా, శిశు సంక్షేమ అధికారులు) అభ్యర్థులకు అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా మంగళవారం పరీక్ష జరగనుంది. టీఎస్‌పీఎస్సీ నిర్వహించనున్న ఈ పరీక్ష సీఆర్‌బీటీ(కంప్యూటర్ ఆధారిత రిక్రూట్‌మెంట్ టెస్ట్) విధానంలో జరగనుంది. రెండు సెషన్లలో పరీక్ష జరగనుండగా 110 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉయదం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌ను నిర్వహించనున్నారు.

నేడు టీఎల్‌ఎం మేళా

జూలూరుపాడు: మండలస్థాయి తొలిమెట్టు బోధనోపకరణాల (టీఎల్‌ఎం) మేళా మంగళవారం స్థానిక కస్తుర్బాగాంధీ బాలికా విద్యాలయంలో జరగనున్నట్లు ఎంఈఓ గుగులోత్ వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్నందని, ప్రతి ఉపాధ్యాయుడు 4 సబ్జెక్టులకు సంబంధించిన టీఎల్‌ఎంలు మేళాలో ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు.

ఎంసెట్ శిక్షణ ప్రారంభం

పాల్వంచరూరల్: మండలంలోని బస్వతారక కాలనీ పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంసెట్ శిక్షణ తరగతులను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రారంభించి మాట్లాడారు. సైన్స్ విద్యార్థులకు ఎంసెట్‌లో ఉచిత శిక్షణ తరగతలను నిర్వహిస్తున్నామని, ఇంటర్ పరీక్షల అనంతరం అర్హత పొందిన విద్యార్థులకు ఉచిత భోజనంతోపాటు హాస్టల్ వసతి కల్పించి, జిల్లాస్థాయిలో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, స్వరూప, గోపాలకృష్ణ, రవీంద్రబాబు, సతీశ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టండి..

టేకులపల్లి: వచ్చే సంక్రాంతి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టి మూడు విడతలుగా రావాల్సిన డీఏలను వెంటనే మంజూరు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘం సమావేశంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రామ్మూర్తి, ఎం.రమణ, నాగేశ్వరరావు, ఎం.మోహన్‌రావు, నందా, పి.వెంకటేశ్వర్లు, వెంకటరామయ్య, భరత్, శ్రీనివాస్, మంగీలాల్, సత్యనారాయణ, సురేశ్, పర్వీన్, తిరుపతి, పారిజాతం పాల్గొన్నారు.

ఏబీ బర్ధన్ వర్ధంతి

సింగరేణి(కొత్తగూడెం): దేశ సమైక్యత, సామాజిక న్యాయం కోసం తన తుదిశ్వాస విడిచే వరకు పోరాడిన మరపురాని మహానేత ఏబీ బర్ధన్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పేర్కొన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ 7వ వర్ధంతిని సోమవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, వాసిరెడ్డి మురళి, రత్నకుమారి, ఎస్.ఫహీమ్, క్రిష్టాఫర్, గోపికృష్ణ, గుమ్మడి సాగర్, కె.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆలయాలు

- ముక్కోటి సందర్భంగా భక్తుల ప్రత్యేక పూజలు
- ఉత్తర ద్వారం గుండా దర్శనమిచ్చిన స్వామివారు



పాల్వంచ: శ్రీ భజన మందిర రామాలయంలో దర్శించుకుంటున్న భక్తులు

వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) సందర్భంగా ఆలయాలు సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉత్తరద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. ముక్కోటి రోజున శ్రీమహావిష్ణువు కొలువై ఉన్న వైకుంఠంలోని అన్ని ద్వారాలు తెరుచుకుని ఉంటాయని, అందుకే ఈ రోజు స్వామిని దర్శించుకుంటే పుణ్య ఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. కాగా, అర్చకులు సైతం ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంటౌన్: బాబూక్యాంప్‌లోని గుడిలో..



కొత్తగూడెంటౌన్: భజన మందిరంలో భక్తుల పూజలు



పాల్వంచ: స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం



ఇల్లెందు: రామాలయంలో పూజ చేస్తున్న మహిళలు



పాల్వంచ: వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

'కాంట్రాక్ట్' సమస్యలపై చర్చించాలి..




మాట్లాడుతున్న సురేందర్

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 3న కోల్‌కతాలో జరిగే జేబీసీసీఐ 11వ వేజ్‌బోర్డ్ సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై చర్చించాలని ఎస్సీసీడబ్ల్యూ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కందగట్ల సురేందర్, కార్యదర్శి గొని నాగేశ్వరరావు విజ్ఞప్తిచేశారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బంగ్లోస్, రైటర్ బస్తీ, ఏరియా ఆస్పత్రి, నర్స్ క్వార్టర్ తదితర ఏరియాల్లో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ సింగరేణివ్యాప్తంగా సుమారు 34 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని, వారి సమస్యలపై జాతీయస్థాయిలో 2018 నుంచి ఇప్పటివరకు ఎలాంటి తీర్మానాలు చేయలేదన్నారు. 11వ వేతన సవరణ విషయంలో 2021 నుంచి ఇప్పటి వరకు 7 సమావేశాలు జరిగినప్పటికీ పురోగతి లేదని, 3న జరిగే సమావేశంలోనైనా చర్చించాలని కోరారు. కార్యక్రమంలో నాగక్క, కరుణ, కొంగలక్ష్మి, శాంత, సరళ, విజయ్‌కుమార్, ఈశ్వర్, కృష్ణ, శశాంక్, రమణ, అప్పారావు, వెంకటలక్ష్మి, వెంకటరమణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందు: బొగ్గు గని కార్మికుల డిమాండ్లపై ఈ నెల 3న కోల్‌కతాలో జరగనున్న జేబీసీసీఐ చర్చల్లో కాంట్రాక్ట్ కార్మికులకు సమాన వేతనం చెల్లించేలా, ఖాళీ క్వార్టర్లను కేటాయించేలా, 2013 నుంచి హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేసేలా ఒప్పందం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రాసుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులోని సీఎస్పీ, రైల్వే సైడింగ్, కోల్ శాంప్లింగ్ కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారని తెలిపారు. వేతన ఒప్పందాలలో వేతనాలు, సౌకర్యాలు, అలవెన్సులు, సెలవులు, కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు కొండపల్లి శ్రీనివాస్, రాములు, మహేందర్, ఇంతియాజ్, సాయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల ఉత్తర్వుల అందజేత



ఉత్తర్వులు అందుకున్నవారితో జీఎం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఎస్సీడబ్ల్యూఏలో పనిచేస్తూ, జనవరి 1 నాటికి అర్హత ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్‌లు అందించారు. సోమవారం జీఎం కార్యాలయంలో జీఎం షాలేమురాజు ఉద్యోగులకు ఉత్తర్వులు అందించి మాట్లాడారు. ప్రతీ సంవత్సరం సర్వీస్ లింక్ ప్రమోషన్లు ఇంక్రిమెంట్లు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ఎంటీ పర్సనల్ సాయిస్వరూప్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.

సుజాతనగర్ చేరిన యాత్ర



స్వాగతం పలుకుతున్న భక్తులు

సుజాతనగర్: హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఇస్కాన్ టెంపుల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో చేపట్టిన భగవద్గీత ధర్మ ప్రచార యాత్ర సోమవారం సుజాతనగర్‌కు చేరుకుంది. డిసెంబర్ 4న త్రిదండి చిన్న జీయర్ స్వామిచే హైదరాబాద్‌లో ప్రారంభమైన యాత్ర 29వ రోజైన సోమవారం ఇక్కడికి చేరుకుంది. ప్రచార యాత్ర రథం వేపలగడ్డ గ్రామం చేరుకోవడంతో కోదండ రామస్వామి ఆలయం వద్ద భక్తులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు ప్రచార రథానికి హారతులు ఇస్తూ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతీ హిందువు ఇంట్లో కచ్చితంగా భగవద్గీత ఉండాలన్నారు. భగవద్గీత చదవడం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చని, జీవనశైలిలో ఎన్నో మార్పులు వస్తాయన్నారు. అనంతరం భక్తులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మనోజ్ అగర్వాల్, సునీల్ రాటి, శ్యామ్‌సుందర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, లెనిన్, లక్ష్మీనారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, కోటిరెడ్డి, ఏలూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 5 నుంచి 31 వరకు పొడిగించాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు మండలాలు, మున్సిపాలిటీల వారీగా రుణ ప్రణాళికను ఏర్పాటు చేయని కారణంగా దరఖాస్తుదారులకు సరైన స్పష్టత లేక తీవ్రంగా నష్ట పోతున్నారని, వెంటనే రుణ ప్రణాళిక రూపొందించేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు.